# ‘సంక్షేమం’ సాగాలంటే..
# బీఆర్ఎస్ గెలువాలే..

- గిరిజనేతరులు, సింగరేణి, ప్రభుత్వ భూముల్లో ఇండ్లు కట్టుకున్నవారికి పట్టాలిచ్చే బాధ్యత నాది..
- కచ్చితంగా గెలిచే నాయకులు కోనేరు కోనప్ప, కోవ లక్ష్మి, దుర్గం చిన్నయ్య
- కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ‘ప్రజా ఆశీర్వాద సభ’ల్లో సీఎం కేసీఆర్

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ) : అటు తెలంగాణలో గానీ, ఇటు నియోజకవర్గాల్లో గానీ రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ గెలవాలని, మా అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు.. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థులు కోనేరు కోనప్ప, కోవ లక్ష్మి, దుర్గం చిన్నయ్యల విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ‘ప్రజా ఆశీర్వాద సభ’ల్లో కేసీఆర్ ప్రసంగించారు. గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వడంతోపాటు సింగరేణి స్థలాలు, ప్రభుత్వ భూముల్లో ఇండ్లు కట్టుకున్న వారికి పట్టాలు ఇచ్చే బాధ్యత నాది అన్నారు. ఆరె కులస్తులను ఓబీసీలుగా, మాలీ కులస్తులను ఎస్టీలుగా గుర్తించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ రాక ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో మంచం పట్టిన మన్యం అని వార్తలు వచ్చేవని, ఈ రోజు ఆ బాధలు పోయాయన్నారు. మారుమూల ప్రాంతాలకు వాగులు, వంకలపై వందల బ్రిడ్జిలు నిర్మించుకున్నామని, మరిన్ని నిర్మించుకుందామని చెప్పారు. గిరిజనులను, నిరుపేదలను బాగు చేసుకున్నామన్నారు. ఇవన్నీ ఇలాగే ఉండాలంటే ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉండే మా అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటేసే ముందు ఆలోచించి ప్రజా ఆంకాక్షలను నెరవేర్చే నాయకులను, ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

**నోట్ల కట్టలు కావాలా..**
**జనంలో ఉండే చిన్నయ్య కావాలా..**

బెల్లంపల్లి చాలా చైతన్యమైన ప్రాంతమని, ఇక్కడ ఉద్యమాలు కూడా జరిగాయని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మంచి వాడైన దుర్గం చిన్నయ్యను గెలిపిస్తే, మంచి ప్రభుత్వం వస్తదని, మంచి పనులు జరుగుతాయని, ప్రజా బాహుళ్యానికి మేలు జరుగుతుందని చెప్పారు. అలా కాకుండా ఎవరో చెప్పారని, వేసే వాళ్లకు ఓటు వేయకుండా వేరే వాళ్లకు వేస్తే ‘మంది మాటలు పట్టుకొని మార్వానం పోతే, మళ్ల వచ్చే సరికి ఇండ్లు కాలినట్లు అవుతుంది’ అన్నారు. అలా జరగనివొద్దన్నారు. రైతుబంధు ఉండాలంటే దుర్గం చిన్నయ్య గెలవాలన్నారు. ఎవడో ఎన్నికల ముందు నోట్ల కట్టలు, సూట్ కేసులు పట్టుకొని వచ్చేటోడు కావాలా.. పొద్దాక జనంలో ఉండే దుర్గం చిన్నయ్య లాంటోడు కావాలా ఆలోచించాలన్నారు. చిన్నయ్య గెలిస్తే రైతుబంధు ఉండుడు కాదు రూ.10 వేలు ఉన్నది రూ.16 వేలు వస్తుందన్నారు. అలాగే రైతులకు 24 గంటల కరెంట్ ఉండాలన్న అది చిన్నయ్య ఉంటేనే సాధ్యం అవుతుందన్నారు. బెల్లంపల్లిలో గవర్నమెంట్ భూములు, సింగరేణి భూములు కలిపి దాదాపు 10 వేల మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చామని దుర్గం చిన్నయ్య చెప్పారని, ఇంకా కొంత మంది ఉన్నారన్నారని తప్పకుండా వాళ్లందరికీ కూడా పట్టాలు ఇప్పించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. ఎవరున్న మీ ఎమ్మెల్యేకు దరఖాస్తు పెట్టుకోండి చేస్తామని చెప్పారు. బెల్లంపల్లిలో వైద్య వ్యవస్థ మెరుగుపడిందన్నారు. వంద పడకల ఆసుపత్రి పెట్టుకున్నామని, దాన్ని ఇంకా కూడా పెంచుకుంటామన్నారు. అదే విధంగా రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టామని, దానిలో చదువుకున్న అందరూ బతుకుతున్నారన్నారు. ఈ రకంగా విద్యారంగంలో కూడా మనం ముందుకు పోతున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే చాలా వాగులపై చెక్ డ్యామ్‌లు కట్టుకున్నామని, చెరువులు బాగు చేసుకున్నామని చెప్పారు. ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాలకు బ్రిడ్జిలు కావాలని అడిగారని, తప్పకుండా ఇంకా కూడా చేస్తామని సీఎం అన్నారు.

**ప్రజా ఆశీర్వాదమే శ్రీరామ రక్ష..**

ఇవాళ డబ్బు కట్టలు పట్టుకొని దిగేటోళ్లు, మళ్ల ఎలక్షన్లు అయిపోతే ఎన్నడన్న కనబడుతరా ఆలోచించాలన్నారు. ఇక్కడికి వచ్చిన కాంగ్రెస్ మనిషిని చెన్నూర్‌రోళ్లు నాలుగు మాట్ల ఓడగొట్టారన్నారు.


ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

మరి చెన్నూర్‌లో చెల్లని రూపాయి.. బెల్లంపల్లిలో చెల్లుతదా.. చెన్నూర్‌లోనే చెల్లకపాయే.. వాళ్లే తీసి కొట్టిరి.. మరి బెల్లంపల్లి వాళ్లం ఏమైనా తెలివి తక్కువోళ్లమా.. చెన్నూర్ కంటే తెలిసి కల్లోల్లమే కదా.. అది రుజువు చేయాలని పిలుపునిచ్చారు. ఆడ చెల్లని రూపాయి ఈడ ఎట్లా చెల్లుతదని, వాళ్లు తిరస్కరించాక, మనం ఎట్టా గెలిపిస్తామన్నారు. ఎన్నికలు రాగానే సూట్‌కేస్‌లు, డబ్బుల సంచులు పట్టుకోవాలే దిగాలే.. వాన్ని కొని, వీన్ని కొని గోల్‌మాల్ చేయాలే తప్ప ఎలక్షన్లు అయ్యాక కడుపు నొచ్చినా, కాలు నొచ్చినా కనబడుతరా.. ఆలోచన చేయాలన్నారు. మంచిగున్న ప్రజాప్రతినిధులను కొందర్ని కొంటున్నరని పాపం అమాయకులు గొర్రెల్లా అమ్ముడు పోతున్నారన్నారు. చిన్నయ్య నువ్వేం ఫికర్ చేయకు.. అమ్ముడు పోయినోడు ఒకడే పోతడు గడ్డపార లెక్క.. కానీ ఇవాళ ప్రజల్లో చైతన్యం ఉంది, ఎవడో అమ్ముడు పోయిండని నువ్వు బయపడకు. ప్రజలు నీ పక్షాన గ్యారంటీగా ఉంటరు. వాళ్లే న్యాయం చెప్తారన్నారు. ఎవరో నలుగురు అమ్ముడు పోయినోళ్లు తలమాసినోల్లే కానీ మనం కాదు.. జనం కాదు అన్నారు. ఈ ప్రజలే మనల్ని కాపాడుతారని, ప్రజల ఆశీర్వాదమే మనకు శ్రీరామ రక్ష అని చెప్పారు. ఇవాళ డబ్బు సంచులు పట్టుకొని దిగి.. నాలుగు రోజులు ఏదో తమాషా చేసి ఎలక్షన్ అవ్వగానే వాడు అటు, మనం ఇటు అనే వాళ్లు కావాల్నా.. లేకపోతే పొద్దాకా బెల్లంపల్లిలో ఉండే చిన్నయ్య కావాలా ప్రజలే నిర్ణయం తీసుకోవాలన్నారు. మీ దివెన ఉంటే తెలంగాణను ఈ దేశంలోనే నంబర్ స్టేట్‌గా తీసుకుపోతామన్నారు. దుర్గం చిన్నయ్య సమంజసమైన నాలుగైదు కోరికలు కోరారని, ఒక ఇంజినీరింగ్ కాలేజీ కావాలన్నడు, ఒక రెసిడెన్షియల్ స్కూలు కావాలన్నడు.. వంద శాతం వాటిని చేసి పెట్టే బాధ్యత నాది అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. మీరు చిన్నయ్యను పెద్ద మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ మంత్రి బోడ జనార్ధన్, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, మాజీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

**సింగరేణిని ముంచిందే కాంగ్రెస్..**

సింగరేణిలో ఇల్లందు తరువాత రెండో గని ప్రారంభించిన ప్రాంతం బెల్లంపల్లి అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. 134 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ సింగరేణిని ముంచింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఈ సంస్థ అచ్చం తెలంగాణదని, నిజాం రాజు ఉన్నప్పుడు పెట్టుకున్న కంపెనీ అని చెప్పారు. వంద శాతం తెలంగాణకు ఉన్న కంపెనీని ఆ నాడు ఉన్న కాంగ్రెస్ దద్దమ్మలు, కేంద్ర ప్రభుత్వ తొత్తుల దగ్గర అప్పులు తెచ్చి కట్టలేక వాళ్లకు 49 శాతం వాటా ఇచ్చారని, దానితో మన వాటా కోల్పోయామని మండిపడ్డారు. తెలంగాణ ఆస్తిని కేంద్రానికి కట్టబెట్టిన దద్దమ్మ పార్టీ కాంగ్రెస్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత వాళ్లు సింగరేణిని సరిగ్గా నడపలేక లాభాలు తేలేక పోయారన్నారు. మూడు, నాలుగు వందల కోట్లే వచ్చేవన్నారు. ఇవాళ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రూ.2.200 కోట్లకు సింగరేణి ఆదాయం పోయిందన్నారు. దసరా, దీపావళి బోనస్ లాభాల్లో వాటా కలిసి ఈ సంవత్సరం రూ.1000 కోట్లు కార్మికులకు ఇస్తున్నామన్నారు. ప్రతి కార్మికుడికి ఇంచుమించు రూ.2.50 లక్షలు డబ్బులు చేతికి వస్తున్నాయన్నారు. ఇదే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల అనుబంధ యూనియన్‌లే సంతకాలు పెట్టి డిపెండెంటు ఉద్యోగాలు ఊడగొట్టించారన్నారు. మళ్లీ తెలంగాణ పార్టీ వచ్చినంకనే వాటిని పునరుద్ధరించి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించుకున్నామని చెప్పారు. ఇవన్ని మీకు తెలుసుని, ఓటు వేసే ముందు అన్ని ఆలోచన చేయాలని సీఎం కేసీఆర్ సూచించారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## ఓటు ఆషామాషీగా వేస్తే ఆగమైతం..

- ఆలోచించి, చర్చించి వేస్తే న్యాయం జరుగుతది..
- హస్తం పార్టీకి ఓటు వేస్తే దళారుల రాజ్యం వస్తది.. జాగ్రత్త..
- జిల్లా ఏర్పాటు తర్వాత ఆసిఫాబాద్ అభివృద్ధిపై చర్చ జరగాలి..
- త్వరలోనే గిరిజనేతరుల భూ సమస్యలకు పరిష్కారం
- ఆసిఫాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ) : తెగించి కొట్లాడి, పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రజా సంక్షేమమే ముఖ్యమని.. కులం లేదు, మతం లేదు, జాతి లేదు అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యమని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ‘ప్రజా ఆశీర్వాద సభ’ల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్ సమీపంలో గల మైదానంలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేసింది, పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు ఏం చేసింది అనే దానిపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలని కోరారు. ప్రజలు ప్రజాస్వామ్య పరిణతి ప్రదర్శించాలి. ఆలోచించి ఓటు వేసినప్పుడే అభివృద్ధి జరుగుతది. ప్రజల వద్ద ఉన్న ఒకే ఒక ఆయుధం ఓటు. అభ్యర్థిని చూసి, వారి వెనుక ఉన్న పార్టీని చూసి ఓటు వేయాలి. ఓటుని ఆషామాషిగా వేస్తే ఐదేళ్లు ఆగమైపోతం. తెలంగాణలో ఇంతకాలం జరిగిన అభివృద్ధి వెనక్కిపోతది. పదేండ్లలో ఆసిఫాబాద్ ఎంత అభివృద్ధి చెందిందో కూడా మీకు తెలుసు. జిల్లా ఏర్పాటు తరువాత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాలలు వచ్చాయి. బీఆర్ఎస్ అధికారంలోనికి వచ్చిన తరువాత లక్షలాది ఎకరాలకు నీరు అందుతోంది. మొన్ననే ఆసిఫాబాద్‌లో 47 వేల ఎకరాలకు రైతుబంధు పట్టాలు ఇచ్చినం. త్వరలోనే గిరిజనేతరుల భూ సమస్యలు కూడా పరిష్కరిస్తాం. కాంగ్రెస్ వాళ్లు అంటున్నరు రైతు బంధు వేస్ట్ అని, మూడు గంటల కరెంటు చాలని, రాహుల్ గాంధీకి వ్యవసాయం అంటే తెలుసా? ఇలాంటి వారికి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు ఉంటాయా? మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రైతుబంధు 16 వేలకు చేరుతది. పింఛన్ రూ.5వేలకు చేరుతది. ఉచిత విద్యుత్‌తో ధాన్యం 3 కోట్ల టన్నులు పండుతోంది. దీంతో రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డులు ఉన్న 93 లక్షల కార్డుదారులకు సన్నబియ్యం ఇయ్యాలని మ్యానిఫెస్టోలో పెట్టినం. ఈ ప్రాంతంలో ఉన్న ఆరె, మాలీ కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇస్తాం. మైనార్టీల పిల్లలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో మంచి చదువులు చదువుకుంటున్నరు. కల్తీ నీళ్లతో మరణాలు లేకుండా స్వచ్ఛమైన నీరు ఇంటింటికీ అందుతోంది. కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపిస్తే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. కాంగ్రెస్‌కు ఓటేస్తే పట్వారి, దళారీల రాజ్యం వస్తది. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలి.

## సర్‌సిల్క్ ఫ్యాక్టరీని కూడా తెరిపిస్తాం..

- కోనప్ప ఈ ప్రాంతంపై అభిమానం ఉన్న వ్యక్తి
- ఎంతో కష్టపడి సిర్పూర్ పేపర్ మిల్లును తెరిపించిండు
- కాగజ్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ) : ‘ప్రజల కోసం కష్టపడే నాయకుడికి అధికారం ఇస్తే అభివృద్ధి చెందుతాం, ఓటుని ఆలోచించకుండా వేస్తే ఇబ్బందులు పడుతాం. సిర్పూర్ నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం కష్టపడే నాయకుడు కోనేరు కోనప్ప. ఎస్పీఎంను తెరిపించేందుకు ఎంతో కష్టపడ్డాడు. ఇలాంటి నాయకుడిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి’ అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ‘ప్రజా ఆశీర్వాద సభ’లో కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. సర్‌సిల్క్ ఫ్యాక్టరీని కూడా తెరిపిస్తామన్నారు. గతంలో పత్రికల్లో చూసేవాళ్లమని పేర్కొన్నారు. అనేక రకాల జ్వరాలతో చనిపోయే వారని, ఇప్పుడు ఇంటింటికీ భగీరథ నీరు అందుతోందన్నారు. స్వచ్ఛమైన నీటితో రోగాలు పోయాయని సంతోషం వ్యక్తం చేశారు. సిర్పూర్‌లో ఉండే గిరిజనేతరులుకు కూడా పోడు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలే సిర్పూర్‌లోని 16 వేల మంది గిరిజనులకు పోడు పట్టాలను అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు నష్టం చేసిందని, ఆత్మగౌరవంతో ఉండే తెలంగాణను ఆంధ్రలో కలిపింది కాంగ్రెస్ పార్టీనే అని తెలిపారు. తెలంగాణ వచ్చినంక ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకొంటూ అభివృద్ధి చెందుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా అంటేనే రోగాలతో మంచం పట్టిన వార్తలు చూశామని పేర్కొన్నారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదని తెలిపారు. అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ల ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో 1,019 గురుకులాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కోనేరు కోనప్పని భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతదని తెలిపారు.